క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు, తదితరులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో ఈ నెల 11 నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని మంత్రి హరీశ్‌రావును కోరుతూ ఆదివారం ఆలయ ఈఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు, స్థానిక నాయకులు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మలతో కలిసి ఉత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, రైతు కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

కొండపోచమ్మకు కోరుట్ల ఎమ్మెల్యే పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో గల కొండపోచమ్మను ఆదివారం కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ దేవాలయాల పేర్లతో ప్రాజెక్టులు కట్టిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఈఓ మోహన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్ రజితరమేశ్, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల తగ్గింపు అంశాన్ని రాష్ట్ర పురపాలిక శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే నూతనంగా ఏర్పాటైన చేర్యాల మున్సిపాలిటీలో ఇంటి పన్నుల విధింపు ఎక్కువగా ఉందని, దీంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, పన్ను తగ్గించాలని ఇటీవల మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసిందన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా మంత్రి స్పందించినట్లు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తెలిపారు.

నియామకం

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన అనుముల నర్సిరెడ్డి లక్కమారి కాపు సంఘ అధ్యక్షుడిగా కుల పెద్దలు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నర్సిరెడ్డి గ్రామ, కుల పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు సంఘ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు లింగం, కోశాధికారి తిరుపతి, సంయుక్త కార్యదర్శి పుల్లయ్య, బాల్‌లింగం, రామచంద్రం, నర్సిరెడ్డి, రవి పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణదారుల అసోసియేషన్ ఎన్నిక

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణదారుల అసోసియేషన్ ఎన్నికలు దుద్దెడ శివారులోని ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షుడిగా దేశిరెడ్డి రాంచంద్రారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా బొద్దుల కనుకయ్య, ఉపాధ్యక్షుడిగా కంజర్ల రాజేశ్, కోశాధికారిగా గున్నాల సత్యం, కార్యదర్శిగా గజ్వెల్లి రమేశ్, సలహాదారులుగా చకిలం మురళీమోహన్, ఐలపురం రవీందర్‌రెడ్డి, దుంబాల వెంకటేశ్, నాగప్రసాద్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కూరెళ్ల బీటీ రోడ్డుకు నిధులు మంజూరు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండల కేంద్రం నుంచి కూరెళ్ల గ్రామం మీదుగా బీటీరోడ్డుకు రూ.3.30లక్షల నిధులు మంజూరైనట్లు సర్పంచ్ గాజుల రమేశ్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు ఉపసర్పంచ్ రాజీనామా

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ జెల్ల రవీందర్ బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి తన రాజీనామా లేఖను ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్‌కు అందజేసినట్లు తెలిపారు. తాను ఏ పార్టీలో చేరనని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల పక్షాన పోరాడుతానన్నారు.

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- గౌరవెల్లి నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగలేదు
- ప్రజలతో చర్చించిన తర్వాతే హుస్నాబాద్‌ను సిద్దిపేటలో కలిపాం
- ప్రజల ఆశీర్వాదంతో మరోసారి డబుల్ మెజార్టీతో విజయం సాధిస్తా
- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



గిరిజనులతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం తండాల అభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు, భోగ్ బండార్ కార్యక్రమాన్ని అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎంపీపీ లకావత్ మానస అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజన మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. గౌరవెల్లి నిర్వాసితులకు తాను అన్యాయం చేశానని కొందరు ఆరోపణలు చేస్తున్నారని, అవసరమైతే తడిబట్టలతో ఆలయంలోకి వెళ్లి ప్రమాణం చేస్తానని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 54 తండాలు, 33వేల మంది ఓటర్లు ఉన్నా గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గతంలో నీటి ఎద్దడి ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు బల్క్ వాటర్‌ను సప్లయ్ చేయించానని, ఇది దేశంలోనే హుస్నాబాద్‌లోనే ప్రారంభించామన్నారు.

బాజాప్తగా విలీనం చేశాం

కొందరు హుస్నాబాద్ నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేశారని ఆరోపిస్తున్నారని, గ్రామ గ్రామాన మీటింగ్‌లు పెట్టి వారితో చర్చించిన తర్వాతే బాజాప్తగా మూడు మండలాలు సిద్దిపేట జిల్లాలో, రెండు మండలాలు కరీంనగర్, రెండు మండలాలు హన్మకొండ జిల్లాలో విలీనం చేశామన్నారు. చౌకబారు మాటలు మాట్లాడొద్దని, నేను ఎవరినీ పల్లెత్తు మాట అనలేదన్నారు. ప్రజల ఆశీర్వాదంతో డబుల్ మెజార్టీతో మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. భూ నిర్వాసిత మహిళలు వారు పెళ్లిళ్లు చేసుకొని బయటకు వెళ్తారని, వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తించదని, ఈ సమస్య దేశమంతా ఉందన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం వారు కోరిన విధంగా పరిహారంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చామని తెలిపారు. ఎస్టీలకు భూములు లేకున్నా ఎంజాయ్‌మెంట్ చేయించి 180 మంది గిరిజనులకు ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రూ.8లక్షలు ఇచ్చామన్నారు. అదేవిధంగా హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రూ.37కోట్ల నిధులతో సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. అలాగే స్వచ్ఛ సర్వేక్షణ్ కింద మున్సిపాలిటీకి రెండు సార్లు జాతీయ అవార్డు వచ్చిందని, దీంతో దేశంలోనే హుస్నాబాద్ పేరు ప్రఖ్యాతి గాంచిందన్నారు. కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, ఎంపీపీలు మానస, కీర్తి, జెడ్పీటీసీ భూక్య మంగ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, వైస్ చైర్‌పర్సన్ రజిత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రూప్‌సింగ్ నాయక్, నాయకులు కిషన్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, సంపత్‌నాయక్, రమేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో 1996–97 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ముందుగా చదువు చెప్పి మృతి చెందిన గురువులు, మృతి చెందిన తోటి విద్యార్థుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం చదువు నేర్పిన గురువులు ప్రభాకర్‌శర్మ, జయరాంరెడ్డి, సోమేశ్వర్, మధుసూదన్, నరసింహచారిలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భానుప్రకాశ్‌రావు, రాములుగౌడ్, బాల్‌రెడ్డి, తూప్రాన్ జెడ్పీటీసీ శోభారాణి విద్యార్థులు పాల్గొన్నారు.



నంగునూరు(సిద్దిపేట): గురువులతో విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు ఉన్నత పాఠశాలలో 1982–83 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చాలా సంవత్సరాల తర్వాత స్నేహితులు ఒకేచోట చేరడంతో తరగతి గదుల్లో చిన్ననాడు చేసిన అల్లరి, చిలిపి పనులను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పాఠశాలకు చేరుకోగానే బెలూన్లు ఎగురవేసి పూల వర్షం కురిపిస్తూ మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో గురువులు నరసింహస్వామి, రామచంద్రారెడ్డి, సంజీవరెడ్డి, రామచంద్రారెడ్డి, రాములు, ఎంఈఓ దేశిరెడ్డిలను శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు.

‘వ్యవసాయ భూములు సస్యశ్యామలం చేయడమే లక్ష్యం’



మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపి వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, మండుటెండలో సైతం చెరువులు కుంటలు మత్తడ్లు దుంకుతున్నాయని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామంలో ఆయన పర్యటించి ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేశారు. అదేవిధంగా తిర్మలాపూర్ గ్రామంలో పర్యటించి గౌడ కులస్తులు ధరించే మోకు ముస్తాబ్ ధరించాడు. గౌడ సంఘం నిర్మాణానికి రూ.5 లక్షలు, ముదిరాజ్ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సబ్బండ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత కేవలం రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు, మల్లేశం, తిరుపతి, తదితరులున్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ప్రిన్సిపల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక



జడ్జి ప్రియాంకను సన్మానిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ప్రిన్సిపల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. 11వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపోలో పలువురు మహిళా ఉద్యోగులు, కండక్టర్లు, ప్రయాణికులను డిపో మేనేజర్ సురేఖతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి ప్రియాంక మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. సమాజంలో ఎదురయ్యే ఒడిదుడుకులను అధిగమిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా జీపీపీ డిపోలో కండక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళలను అభినందించారు. అనంతరం మహిళలకు వివిధ క్రీడాపోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జీపీపీ డిపో ఎస్టీఐ కనకలక్ష్మీ, ఈడబ్ల్యూ మెంబర్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న దృశ్యం

దుబ్బాక: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కౌన్సిలర్ నిమ్మ రజితయాదగిరి, కో–ఆప్షన్ సభ్యుడు ఆస స్వామి అన్నారు. కో–ఆప్షన్ మెంబర్ ఆస స్వామి సౌజన్యంతో దుబ్బాకలో జరుగుతున్న క్రికెట్ టోర్నీని ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ ఆస యాదగిరి, టోర్నీ నిర్వాహకులు శ్రీశైలం, రాకేశ్, తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కనకరాజుకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.60వేలు మంజూరు కాగా ఆదివారం సర్పంచ్ రాజు బాధితుడికి చెక్కు అందించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, నరసింహ్మారెడ్డి, ఐలయ్య, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అదే గ్రామానికి చెందిన గజం శ్రావణ్ గతేడాది క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు మంజూరు కావడంతో బాధిత కుటుంబానికి చెక్కు అందించారు.

దుబ్బాక మోడల్ స్కూల్ ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నిక

దుబ్బాక: మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట వార్డులో తెలంగాణ ఆదర్శ పాఠశాల ఎస్‌ఎంసీ కమిటీని ఎన్నుకున్నామని ప్రిన్సిపాల్ సుప్రియ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. కమిటీ నూతన చైర్మన్‌గా బాల వెంకన్న, వైస్ చైర్మన్‌గా తీర్థహతి రాధ, సభ్యులుగా శ్రీనివాస్, జ్యోతి, అనిత, మంగ, రేష్మ, శ్రీకాంత్, వాణిలను ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నిక ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, ఎంఈఓ జోగు ప్రభుదాస్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చంద్రసాగర్, ఎంపీటీసీ రాంరెడ్డి, సర్పంచ్ గుండా శంకర్, వార్డుసభ్యులు బంగారయ్య, శ్రీజశ్రీకాంత్, సీఆర్పీ నవీన్‌కుమార్ పాల్గొన్నట్లు తెలిపారు.

ఘనంగా ముగిసిన హనుమాన్ చాలీసా యాగం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి హనుమాన్ ఆలయంలో 365 రోజుల నుంచి నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా యాగం ఆదివారంతో ఘనంగా ముగిసింది. యాగం ముగింపు కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బ్రైట్‌వే కమ్యూనికేషన్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి, తదితరులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ రోడ్డు మార్గం మరమ్మతులను త్వరలోనే చేపడుతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గిరీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

గజ్వేల్: సీఎం కేసీఆర్ కృషితో గజ్వేల్ పట్టణంలోని అన్ని వార్డుల్లో మెరుగైన వసతులు సమకూరుతున్నాయని 19వ వార్డు కౌన్సిలర్ గుంటుకు శిరీషరాజు అన్నారు. ఆదివారం ఆ వార్డు పరిధిలో సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు పులి బాల్‌చంద్రం, సాయి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా

కోహెడరూరల్(హుస్నాబాద్): తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘ ఏఐటీయూసీ కోహెడ మండల అధ్యక్షుడిగా మండలంలోని పరివేద గ్రామానికి చెందిన రడపు శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా అధ్యక్షుడు బెక్కంటి సంపత్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికులకు సంక్షేమ పథకాలు అదే విధంగా కృషి చేస్తానన్నారు.



ఒగ్గు కళాకారుల విన్యాసాలు

వైభవంగా బీరప్ప ఉత్సవాలు



గంగమ్మకు పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామంలో కురుమ కులదైవం బీరప్ప(పెద్ద) ఉత్సవాలు ఆదివారం అంబరాన్నంటాయి. ఉదయం 10 గంటలకు బియ్యం సుంకుట, మధ్యాహ్నం డోలుచప్పుళ్లు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య కురుమ కులస్తులు ఊరేగింపుగా గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లి గంగమ్మకు బోనం సమర్పించి, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఒగ్గు పూజారులు లింగాలకు గంగస్నానం చేయించి గుడికి తీసుకొచ్చారు. ఒగ్గు పూజారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రాత్రి లగ్న బోనాల మీద, ఇళ్ల మీద సరుగు వేశారు. అనంతరం మహిళలు బోనాలు తీసుకొని ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో బీరప్ప పండగకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నేడు కమరాతి బీరప్ప కల్యాణోత్సవం నిర్వహించేందుకు కురుమ సంఘం సభ్యులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కుమర సంఘ పెద్దలు, కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రబృందం

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి గజ్వేల్‌కు చెందిన ఆపన్నహస్త మిత్ర బృందం సభ్యులు చేయూతనందించారు. దౌల్తాబాద్‌కు చెందిన లింగం కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు ఈ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం గజ్వేల్‌లో బాధిత కుటుంబ సభ్యులకు రూ.15వేల నగదుతో పాటు రూ.5వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేసి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ఆపన్న హస్త మిత్ర బృందం అధ్యక్షుడు పాశికంటి బాల్‌చంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి స్వామి, సభ్యులు సంజీవరెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, బాల్‌శేఖర్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



యువతకు క్రీడా సామగ్రి అందజేస్తున్న రవీందర్

కొండపాక(గజ్వేల్): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామంలో ఆదివారం యువతకు వాలీబాల్ క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా దేవి రవీందర్ మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడా నైపుణ్యతలు కలిగి ఉండేందుకు అవసరమైన సహాయ సహకారాన్ని అందజేస్తామన్నారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు వచ్చేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యువత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ కుటుంబానికి సాయం



నగదు అందజేస్తున్న సిబ్బంది

గజ్వేల్‌రూరల్: (జీపీపీ) గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. సిద్దిపేట సమీపంలోని ఎన్సాన్‌పల్లికి చెందిన కండక్టర్ భిక్షపతి గత నెల 27న జీపీపీ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో సంగారెడ్డి నుంచి గజ్వేల్‌కు వస్తుండగా మార్గమధ్యలో నర్సాపూర్ వద్ద గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడు భిక్షపతి కుటుంబ సభ్యులను జీపీపీ డిపోకు చెందిన పలువురు ఉద్యోగులు, కార్మికులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.77,800ల ఆర్థికసాయం అందజేసి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో జీపీపీ ఆర్టీసీ డిపో సిబ్బంది నర్సింలు, కనకయ్య, ఎల్లాగౌడ్, నాగరాజు, అంబదాస్, జైపాల్, శ్రీరామ్, మల్లేశం, ఎల్లయ్య, నరేందర్, రమేశ్, భోగేందర్‌రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పంబాల కులస్తులను ఆదుకోవాలి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నంగునూరు(సిద్దిపేట): కుల దేవతలను నమ్ముకొని పోచమ్మ ఆలయంలో అర్చకులుగా పని చేస్తున్న పంబాల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని సుదర్శన్, రంజిత్‌కుమార్, రఘువర్దన్ కోరారు. ఆదివారం నంగునూరులోని పోచమ్మ ఆలయంలో సమావేశం నిర్వహించి ఆలయ కమిటీ చైర్మన్ కోల మహేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయంలో పట్నాలు వేస్తూ తాతల కాలం నుంచి జీవనం సాగిస్తున్న తాము ఆర్థికంగా ఎంతో వెనుకబడ్డామన్నారు. పట్నాల కట్నం రూ.5 వేలు పెంచడంతో పాటు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, జయపాల్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మద్దూరు(హుస్నాబాద్): రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బీజేపీల్లో కార్యకర్తలు లేకుండా పోతారని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం బెక్కల్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి వారిని గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారని, అందుకోసమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజలందరూ బీఆర్‌ఎస్ పార్టీ వెంట నడవాలని సూచించారు. కార్యక్రమంలో దూల్మిట్ట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి, నాయకులు రాములు, రాజమల్ల, నల్లగొప్పల రాములు, భిక్షపతి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి